నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
శనివారం 08 మార్చి 2025 పేజీలు 8





# అన్నింటా వెనుకబడ్డ ఆదోని

- మహిళల్లో 75 శాతం నిరక్ష్యరాస్యులే
- వలసలూ ఎక్కువే
- అభివృద్ధికి నిధులివ్వండి
- శాసనసభలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే పార్థసారధి



ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** ఒకనాడు రెండవ ముంబాయిగా పేరు గాంచిన ఆదోని ఇప్పుడు అన్నింటా వెనుకబడిపోయిందని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం శాసనసభలో ఆదోని వెనుకబాటుతనంపై ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. ప్రభుత్వం నిర్వహించిన ఆర్థిక సర్వేలో కర్నూలు జిల్లా పూర్తిగా వెనుకబడిందన్నది స్పష్టమైందని,ఇందులోనే ఆదోని నియోజకవర్గం అన్ని రంగాల్లో అధమస్థానంలో ఉందన్నది కూడా స్పష్టమైందని ఆయన చెప్పారు. అతి తక్కువ వర్షాతం ఉన్న

మిగతా 2లో

## మూడు పువ్వులు ఆరు కాయలుగా

# అక్రమ కలప వ్యాపారం

- అక్రమ కలప లారీని పట్టుకున్న అధికారులు
- కలపను తరలిస్తున్న లారీని ప్రైవేటు గోడౌన్‌లో ఉంచిన వైనం

**బేతంచెర్ల ,మేజర్ న్యూస్ :** అడవులను కాపాడాలి, సంరక్షించాలి,వన్యప్రాణులను కాపాడాలి, అడవులను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గత నెలలో పారెస్టు అధికారులు గ్రామాలలో కళజాత బృందంతో ప్రజలకు అవగాహన కల్పించారు.కానీ మాటలే తప్ప ఆచరణలో అధికారులే ప్రభుత్వ నిబంధనలు మాత్రం అమలు చేయడం లేదని చెప్పవచ్చు. బేతంచెర్ల మండల పరిధిలోని గోరుమాను కొండ, సీతారామపురం,ఎంబాయ్ ముద్దవరం, ముసలాయి చెరువు, పెండెకల్, రేపల్లె, వీరాయిపల్లె, తదితర గ్రామల సమీపంలో విస్తారంగా అడవులు ఉండడంతో మండలానికి చెందిన కొందరు ఇదే అదునుగా భావించి అడవులల్లో ఉన్న చెట్లను అక్రమంగా నరికి ఇతర ప్రాంతాలకు తరలిస్తు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.ఇందులో ఒక యువకుడు పుష్ప రేంజ్‌కి ఏమాత్రం తగ్గకుండా,తమ వ్యాపార సామ్రాజ్యాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరించుకొని, యథేచ్ఛగా అక్రమంగా కలపను తరలిస్తూన్నాడు.అటవీ ప్రాంతాల్లో

మిగతా 2లో




పట్టుబడిన లారీలో ఉన్న అక్రమ కలప

పట్టుబడిన లారీ ప్రైవేటు గోడౌనుకు తరలించిన దృశ్యం

# లెక్కలు చెప్పిన కలెక్టర్

- ఎస్‌ఏపి క్యాంప్ కెఎంసి స్కూల్‌లో టీచర్ అవతారమెత్తిన కలెక్టర్ రంజిత్ బాషా
- చిన్న కోడిగుడ్లను సరఫరా చేయడం పై ఆగ్రహం



విద్యార్థులకు బోధన చేస్తున్న కలెక్టర్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాష శుక్రవారం కాసేపు ఉపాధ్యాయుడిగా మారిపోయారు. విద్యార్థులకు లెక్కల్లో మెళకువలను తెలియజేశారు. నగరంలోని ఎస్‌ఏపి క్యాంప్‌లోని కర్నూలు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలకు వెళ్లిన ఆయన పదవి తరగతి గదిలోకి వెళ్లి ఆ సమయంలో గణితం చెబుతున్న ఉపాధ్యాయుడిని పబ్లిక్ పరీక్షల్లో గణితం సబ్జెక్ట్ ఏ విధంగా గుర్తు పెట్టుకోవాలని, సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకోవాలన్న చిట్కాలు చెబుతున్నారా? అని ప్రశ్నించారు. గణితం సులభంగా అర్థమయ్యేలా బోధించాలని ఆయన సూచించారు. పదవ తరగతి విద్యార్థులు ఏ విధంగా గణితంలోని అంశాలను గుర్తు పెట్టుకోవాలన్నది స్వయంగా కలెక్టర్ విద్యార్థులకు చెప్పారు. గణిన సమస్యలు విభాగాలుగా చేసుకుని పరిష్కరించినట్లయితే సమాధానం చాలా బాగా

మిగతా 2లో

## ఎగువలో హనుమంత వాహనంపై ఊరేగిన

# జ్వాలా నరసింహుడు

- దిగువలో హంస వాహనంపై విహరించిన శ్రీ ప్రహ్లాద వరదుడు



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బ్రహ్మోత్సవాలు అహోబిలం జనరల్ మేనేజర్ మురళీధరన్, జాబితా సలహా సభ్యులు వైకుంఠం, మణిందర్/ అడ్మినిస్ట్రేషన్ సుదర్శన్‌ల ఆధ్వర్యంలో కన్నుల పండుగలా జరుగుతున్నాయి.

మిగతా 2లో

# 600 మొబైల్ ఫోన్లు రికవరీ

- రూ.1 కోటి 20 లక్షలు విలువ చేసే మొబైల్‌ఫోన్లు బాధితులకు అందజేసిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్




పట్టుబడిన మొబైల్ ఫోన్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

**కర్నూలు క్రైం, మేజర్ న్యూస్ :** కర్నూలు సైబర్ ల్యాబ్ పోలీసులు రికవరీ చేసిన రూ. 1కోటి20లక్షలు విలువ చేసే 600 మొబైల్ ఫోన్లను బాధితులకు అందచేసినట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని పేరెడ్ మైదానంలో మొబైల్ రికవరీ మేళా కార్యక్రమాన్ని

మిగతా 2లో

## పతకాలతో వన్నె తెస్తున్న

# క్రీడా'మణు'లు

- క్రీడల్లో జాతీయ వేదిక పై సత్తా చాటుతున్న క్రీడాకారిణులు
- అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని మహిళా క్రీడాకారుణుల పై ప్రత్యేక కథనం



**కర్నూలు స్పోర్ట్స్, మేజర్ న్యూస్ :** జిల్లాకు చెందిన పలువురు మహిళా క్రీడాకారిణులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో తనదైన సత్తా చాటుతూ పతకాలే లక్ష్యంగా క్రీడారంగంలో దూసుకుపోతున్నారు. ముఖ్యంగా కర్నూలు నగరానికి చెందిన డి వెంకటేశ్వరి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటుతుంది. నగరంలోని క్లస్టర్ యూనివర్సిటీలో బిఏ మూడో సంవత్సరం చదువుతున్న మరో క్రీడాకారిణి బోయ లావణ్య ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తుంది. ఈ ఇరువురు క్రీడాకారిణులపై అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని సూర్య దినపత్రిక కథనాన్ని అందిస్తుంది.

మిగతా 2లో

# లెక్కలు చెప్పిన కలెక్టర్


అన్నం పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ భాషా

(మొదటి పేజి తరువాయి)

గుర్తుంటుందని ఆయన వివరించారు. విద్యార్థి దశలో పదవతరగతి చాలా కీలకమైనదని, బాగా చదువుకుని మంచి మార్కులు సాధించాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని గుర్తుంచుకుని సమయం వృధా చేయకుండా ఇష్టంగా చదువుకోవాలని ఆయన చెప్పారు. వర్చువల్ విధానం ద్వారా పాఠాల బోధనను బాగా వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. పాఠశాల ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి మూడవ శనివారం స్వచ్ఛతా దివస్‌ను జరుపుకోవాలని ఆయన చెప్పారు. పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను త్వరలోనే ఏర్పాటు చేయిస్తామని ఆయన చెప్పారు.

**గుడ్లు సరఫరా చేసే వారికి షోకాజ్‌నోటీసులివ్వండి: డిఇఓకు ఆదేశం** : ఎస్‌ఏపి క్యాంప్‌లోని కెఎంసి ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ రంజిత్‌బాష మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న కోడి గుడ్లు చిన్నగా ఉండడాన్ని గమనించి సంబంధిత కాంట్రాక్టర్‌ను షోకాజ్ నోటీసు ఇవ్వాలంటూ జిల్లా విద్యాశాఖాధికారిని ఫోన్‌లో ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని ఆయన ఉపాధ్యాయులను ఆదేశించారు.

# మూడు పువ్వులు ఆరు కాయలుగా అక్రమ కలప వ్యాపారం

(మొదటి పేజి తరువాయి)

చెట్లను ముక్కలు,ముక్కలుగా కట్ చేసి లారీలు,ట్రాక్టర్లలో యధేచ్ఛగా అక్రమ కలపను దొంగిలించి తీసుకుపోతున్నా, ఈ పుష్ప అటవీ దొంగను ఏమి చేయకుండాసంబంధిత శాఖ అధికా రులే కాపాడుతూ ఎక్కడ కేసులు నమోదు కాకుండా చూడడం గమనార్హం. శుక్రవారం రేపల్లె సమీపంలోని అడవిలో నుంచి వస్తున్న ఏపీ39 టిటి6651 అనే నంబర్ గల మినీ లారీని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమణారెడ్డి తన బృందంతో వెళ్లి సీజ్ చేశారు.అయితే మీనీ లారీలో పెద్దపెద్ద దుంగలు ఉండగా సదరు అధికారి మాత్రం వంట చెరకు అని చెప్పడం గమనార్హం.అడవుల్లో ఉన్న నారేప, నీరుద్ధి, ఇనుముద్ది, టేకు, సోమ వంటి చెట్ల ను నిబంధనలకు విరుద్ధంగా నరకకూడదని చట్టాలు చెబుతున్న ఆయువకుడు అడవులే తమకు ధనార్జనను తెచ్చి పెట్టె కల్పతరువుగా భావించి, అక్షయ పాత్రలా అడవులలో ఉన్న కలపను తరలించి సొమ్ము చేసుకుంటున్నాడు. అక్రమ కలపను తరలించే దొంగల ముఠాకు అధికారులు, రాజకీయ నాయకుల అండదండలు, ఉండడం దారుణమ ని చెప్పవచ్చు.




ఈ అక్రమ కలంను ఇటుకల బట్టీలకు, కలపను సొమ్ము చేసుకునే గోడౌన్లకు యధేచ్ఛగా తరలిస్తూ పుష్ప రేంజ్‌ని తలదన్నెలా తన సామ్రాజ్యాన్ని విస్తరించాడు. కాగా ఇదే యువ కుడు తన సామ్రాజ్యాన్ని విస్తరించే భాగంలో కలపను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా ,అడవుల విస్తీర్ణం ప్రస్నార్థకంగా మారుతున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం కొసమెరుపు.కాగా పట్టుబడ్డ మినీ లారీని అధికారులు పోలీస్ స్టేషన్ కు లేదా సంబంధిత ఫారెస్ట్ శాఖ కార్యాలయానికి తరలించాల్సి ఉన్న ఒక ప్రైవేట్ కలప గోడౌన్ కు తరలిం చడం గమనార్హం..

# ఎగువలో హనుమంత వాహనంపై ఊరేగిన జ్వాలా నరసింహుడు



(మొదటి పేజి తరువాయి)

అందులో భాగంగా నాలుగవ రోజైన శుక్రవారం ఉదయం శ్రీ జ్వాల నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, పూలామాలలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చి పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవముమూర్తులకు అర్చకులు వేదమంత్రాల మధ్య పంచామృతాభిషేకం నిర్వహించారు. రాత్రి శ్రీ జ్వాల నరసింహ స్వామి హనుమంత వాహనంపై కొలువు దీరి భక్తులకు దర్శన మిచ్చారు. పూజాల అనంతరం హనుమంత వాహనంపై స్వామి వారిని కూర్చోండ బెట్టి ఆలయ మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

**దిగువ అహోబిలంలో :** దిగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవ రోజైన శుక్రవారం హంస వాహనం సేవ అంగ రంగ వైభవంగా జరిగింది.ఆలయ ప్రధానఅర్చకులు వేణు గోపాలా చార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం వేకువజామునే అర్చక బృందంతో కలిసి ఉత్సవమూర్తులైన శ్రీ ప్రహ్లాద వరద స్వామి,శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు



నిర్వహించారు.అనంతరం హంస వాహనంలో కొలువుంచి ఆలయ మాడ వీధుల గుండా ఊరేగింపుగా మఠం వద్దకు చేరుకున్నారు. మఠం వద్ద 46వ పీఠాధిపతి శ్రీవన్ శ్రీ శఠగోప రంగనాథ యతేంద్ర మహాదేశీకన్ స్వామి ఉత్సవ మూర్తులకు మహా మంగళ హారతి సమర్పించి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు ప్రధాన అర్చకులు అభిషేకం నిర్వహించారు. రాత్రి సూర్య ప్రభ వాహనంపై శ్రీ ప్రహ్లాద వరద స్వామి కొలువుదీర్చి మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

**నేడు అహోబిలంలో :** ఎగువ అహోబిలంలోశనివారంఉత్సవ మూర్తి శ్రీ జ్వాల నరసింహ స్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు ఉదయం శేషవాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంపై కొలువుదీర నున్నారు. దిగువ అహోబిలంలో ఉదయం శ్రీ ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు శ్రీ యోగా నృసింహ గారుడ విమాన వాహన సేవ,రాత్రి శ్రీ ప్రహ్లాద వరద స్వామి హనుమంత వాహనంపై కొలువుదీరి ఆలయ మాడవీధుల గుండా ఊరేగనున్నారు.

# ఈ.ఒ.ఆర్డీ సతీష్ కుమార్ రెడ్డికి సన్మానం

**బనగానపల్లెమేజర్,న్యూస్ః**

బనగానపల్లె ఈ.ఒ.ఆర్డీ సతీష్ కుమార్ రెడ్డిని శుక్రవారంనాడు యాగంటి ఆలయ ఈ.ఒ చంద్రుడు , యాగంటిపల్లె ఉప సర్పంచ్ మౌళీశ్వర రెడ్డీలు సత్కరించారు. ఇటీవల జరిగిన యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా దేవస్థానం నందు పారిశుధ్య ఏర్పాట్లలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా విజయవంతం చేసినందుకు వారిని సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు.



# అన్నింటా వెనుకబడ్డ ఆదోని

(మొదటి పేజి తరువాయి)

నియోజకవర్గంగా ఆదోని ఉందన్నారు. ఫలితంగా నిరంతరం తాగునీరు, సాగునీరు సమస్యగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా లక్షలాది మంది పొట్ట చేతపట్టుకుని వలసలు వెళుతున్నారన్నారు. దీన్ని నిరోధించేందుకు నియోజకవర్గానికి ప్రత్యేకంగా నిధులివ్వాలన్నారు. అక్షరాస్యతలో కూడా ఆదోని వెనుకబడి ఉందని, మహిళల్లో 75 శాతం నిరక్షరాస్యులుగా ఉన్నారన్నారు. 8శాతం బాలకార్మికులున్నార న్నారు. సర్వశిక్షా అభియాన్ ద్వారా పాఠశాలల ద్వారా చదువు చెప్పిస్తామంటూన్నా అరకొర వసతులు వెక్కిరిస్తున్నాయన్నారు. అరకొర వసతులున్న హాస్టల్స్‌లో చదువు ఎలా సాగుతుందో చెప్పండి అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. హాస్టల్ పేరు చెప్పి కోట్ల రూపాయలు తినేస్తున్నారన్నారు. ఆదోని నియోజకవర్గానికి 10 సీజనల్ హాస్టల్స్ ఇవ్వాలని కోరారు.

**నిధులిస్తామన్న మంత్రి లోకేష్ :** యువగళం పాద యాత్రలో ఆదోని నియోజకవర్గంలో పర్యటించినప్పుడు అక్కడి సమస్యలను ప్రత్యక్షంగా చూశానని, సమస్యల పరిష్కారానికి ఎన్డీఏ ప్రభుత్వం సహకరిస్తుందని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆదోని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. వలసలు వెళ్లే వారితో తాను మాట్లాడానని, స్వయంగా వారి సమస్యలు తనకు తెలుసునని ఆయన చెప్పారు. ఆదోనిలో తాగు, సాగు నీటి సమస్య పరిష్కారానికి ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చానని, దానిని నెరవేర్చుకుంటామని, ఇరిగేషన్ మంత్రితో ఈ విషయంపై చర్చిస్తామని లోకేష్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. ఆదోని నియోజకవర్గంలో నీటి సమస్య పరిష్కారానికి సరైన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. అపార్ ఐడి ద్వారా బడి బయట పిల్లలను బడిలో చేర్చించేలా చూస్తామని కూడా లోకేష్ హామీ ఇచ్చారు.

# పతకాలతో వన్నె తెస్తున్న క్రీడా'మణు'లు

(మొదటి పేజి తరువాయి)

**రైల్వే శాఖలో ఉద్యోగం సాధిస్తా : డి వెంకటేశ్వరి :** కర్నూలు నగరానికి చెందిన వంట మాస్టర్ బి మద్దిలేటి,బి సరస్వతిల కుమార్తె డి వెంకటేశ్వరి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పలు వేదికలపై సత్తా చాటుతుంది. గురువు కాశీరావు శిక్షణలో రాటుతేలుతూ పథకాల వేటలో రాణిస్తుంది. క్రాస్ కంట్రీ విభాగంలో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో భారతదేశం తరుపున పాల్గొని పతకం సాధించాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నట్లు వెంకటేశ్వరి తెలిపింది. ఇప్పటికే మూడుసార్లు జాతీయ స్థాయి పోటీలు,మూడుసార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించింది. ఉత్తరాఖండ్‌లో జరిగిన మోడ్రన్ పెంటాతలాన్ విభాగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ క్రీడలకు రాష్ట్ర జట్టు తరుపున పాల్గొని జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేసింది.


జాతీయ పరుగుపందెంలో పాల్గొన్న వెంకటేశ్వరి(ఫైల్ ఫోటో)


ఫుట్‌బాల్ సాధన చేస్తున్న బోయ లీలావతి

**పోలీస్ ఉద్యోగం సాధించి మహిళలకు సాయం అందిస్తా : బోయ లీలావతి :** స్పోర్ట్స్ కోటా ద్వారా పోలీస్ ఉద్యోగం సాధించి ఆపదలో ఉన్న మహిళలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని బోయ లీలావతి తెలిపింది. ఫుట్‌బాల్ రంగంలో ఇప్పటికే మూడుసార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనగా తమిళనాడులో జరిగిన దక్షిణ భారత స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల ఫుట్‌బాల్ పోటీలకు క్లస్టర్ యూనివర్సిటీ తరుపున ఇప్పటికే ప్రాతినిధ్యం వహించింది. తండ్రి బోయ భాస్కర్ తల్లి బోయ లీలావతిలు స్వతాహగా రైతు కూలీలు కావడంతో ఆర్థిక ఇబ్బందులను సైతం ఎదుర్కొంటూ శిక్షకుడు బ్రహ్మకుమార్ సారథ్యంలో రాటుతేలుతూ పతకాలే లక్ష్యంగా ముందుకు సాగుతుంది.

# 600 మొబైల్ ఫోన్లు రికవరీ

(మొదటి పేజి తరువాయి)

ఏర్పాటు చేసి బాధిత ప్రజలకు మొబైల్ ఫోన్లు అందచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు రైల్వే స్టేషన్లు, జాతరలు,స్కూల్స్,కళాశాలల్లో మొబైల్స్ పోగొట్టుకుంటున్నారన్నారు. మహారాష్ట్ర,తమిళనాడు, చెన్నై,హైదరాబాద్ రాష్ట్రాల్లో పలు జిల్లాల నుండి రికవరీ చేసేందుకు కృషి చేసిన ప్రతిఒక్క పోలీసును, ప్రత్యేకంగా సైబర్ ల్యాబ్ పోలీసులను అభినందిస్తున్నామన్నారు. మొబైల్‌లో మనకు సంబంధించిన పర్సనల్ వివరాలు,ఫోన్ నెంబర్లు,వ్యాపార లావాదేవీలు,అటాచ్‌మెంట్స్,సెంటిమెంట్స్, ఆన్‌లైన్ బ్యాంక్ ఖాతా వ్యవహారాలు ఉంటాయన్నారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకుంటే వెంటనే కర్నూలు పోలీస్ వెబ్‌సైట్‌కు వెళ్లి పోగొట్టుకున్న మొబైల్ ఐఎంఈ వివరాలు తెలియజేస్తే సెల్ ఫోన్ రికవరీ చేసేందుకు కృషి చేస్తారన్నారు. ఈ పోలీస్ సేవకు ఎలాంటి రుసుం చెల్లించనవసరం లేదని ఉచితం అన్నారు. ఫోన్ పోయిన తర్వాత బాధపడడం కంటే పోగొట్టుకోకుండ జాగ్రత్తలు పాటించడం మంచిదని ఆయన సూచించారు. ఈ కార్యక్రమలలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా,కర్నూలు డిఎస్పీ బాబు ప్రసాద్,ఎఆర్ డిఎస్పీ భాస్కర్‌రావు,సిఐలు తేజమూర్తి,అబ్దుల్ గౌస్,రామయ్య నాయుడు,నాగరాజారావు,సైబర్ ల్యాబ్ సిఐ వేణుగోపాల్,టెక్నికల్ టీం పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ షాపుల తనిఖీ

## – రూ.21.76 లక్షల అమ్మకాలు నిలుపుదల

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు జిల్లాలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలలో బయో ఉత్పత్తుల అమ్మకాలపై అంతర్గత తనిఖీ నిర్వహించారు. వ్యవసాయ సంచాలకులు ఆంజనేయ, సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్, మండల వ్యవసాయాధికారి ప్రసాదరావులు బృందాలుగా ఏర్పడి ఆకస్మికంగా తనిఖీలు చేయడం జరిగింది. విశ్వనాథ్ ఆగ్రో ఏజెన్సీ, వైఎన్‌రెడ్డి ఆగ్రో ఏజెన్సీస్, వెంకట సునీల్ ట్రేడర్స్ దుకాణాలలో బయో ఉత్పత్తుల కంపెనీలకు సంబంధించిన అనుమతి పత్రాలు, రిజిస్టార్, బిల్ బుక్స్, రసీదులను, నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన ధృవపత్రాలు లేని పలు బయో ఉత్పత్తుల కంపెనీలకు సంబంధించిన రూ. 21,76,000 విలువగల ఉత్పత్తుల అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదల చేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వంచే అనుమతి పొందిన బయో ఉత్పత్తులనే విక్రయించాలని అన్నారు. అదే విధంగా అమ్మకాలకు అవసరమైన ధృవపత్రాలు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. లేనిచో చట్ట ప్రకారం దుకాణాల లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ, ఏవోలు

# గ్రామాలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా మారుద్దాం..!

## గ్రామ పంచాయతీ తీర్మాణం చేయాలి – ఎంపీడీవో గోపీకృష్ణ



**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** జూపాడుబంగ్లా మండలంలోని చెత్త సంపద కేంద్రం వద్ద హ్యాడ్స్ ఆన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఎంపీడీవో గోపీకృష్ణ అధ్యక్షతన ఈవోఆర్డీ సంజన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కమీషనర్ పీఆర్అండ్ ఆర్డీ, జిల్లా కలెక్టర్, డీపీవో నంద్యాల వారి ఆదేశాల మేరకు శుక్రవారం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఆవరణంలో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ఎస్‌డబ్ల్యుపీసీ షెడ్లు పని చేయాలని, ప్రతి ఇంటి నుంచి చెత్త, వ్యవసాయ వ్యర్థాలను సేకరణ చేసి వానపాముల ఎరువులను తయారు చేయాలని, ముఖ్యంగా గ్రామాలలో ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామని, ప్రతి గ్రామ పంచాయతీలో తీర్మాణం చేయాలని ఎంపీడీవో అన్నారు. అలాగే హరిత రాయబారులు వారికి సరైన వేతనం ప్రతి నెల రావాలి అంటే వారు ప్రతి నెల 3 టన్నుల తడిచెత్తను సేకరించి ఎస్‌డబ్ల్యుపీసీ షెడ్లకు తరలించాలని ఆయన అన్నారు. ముఖ్యంగా ప్రతి గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు, పొదుపు మహిళలకు, రైతులకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాలయ్య, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తిప్పన్న, పుల్లయ్య, వెంకట సుబ్బారెడ్డి, సాలుబాష, తదితరులు పాల్గొన్నారు.

# లింగ మూసాదారణ పై అవగాహన సదస్సు



**పాణ్యం, మేజర్‌న్యూస్ :** మండలంలోని ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం లింగ మూసాదారణ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళా సాధికారత, కమిటీ, అంతర్గత ఫిర్యాదు కమిటీ, ఐఐసీ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు మహిళా సాధికార కమిటీ కోఆర్డినేటర్ హరిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాంతిరామ్ మెడికల్ కళాశాల మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు. రచన, పదవాఖ్య పోటీలు నిర్వహించి విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ టి.జయచంద్రప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ డీవీ అశోక్‌కుమార్, విద్యార్థుల వ్యవహారాల డీన్ డాక్టర్ డి.రామిరెడ్డి, మహిళా సాధికారత కమిటీ కోఆర్డినేటర్ ఎస్ హరిత, ఐసీసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.సుధామాధురి, ఐఐసీ కోఆర్డినేటర్ టి.శాంతలత, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

# మహానందీశ్వరుడి సన్నిధిలో పెనుగొండ పీఠాధిపతి ప్రత్యేక పూజలు



మహానంది క్షేత్రంలో పెనుగొండ పీఠాధిపతికి వేద ఆశీర్వచనం అందిస్తున్న దృశ్యం

**మహానంది, మేజర్‌న్యూస్ :** ప్రముఖ పుణ్య క్షేత్రమైన మహానందిలో పెనుగొండ కైలాస ఆశ్రమం పీఠాధిపతి కైలాస ఆనందగిరి స్వామిజీ పూజలు నిర్వహించారు. శుక్రవారం తన శిష్య బృందంతో, కుటుంబ సభ్యులతో మహానంది క్షేత్రానికి వచ్చిన వీరికి ఆలయ మర్యాదలతో పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసప్రసా ద్‌లు స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరి సమేత మహానందీశ్వర స్వామివార్లకు అభిషేకార్చన పూజలు నిర్వహించారు. అలంకార మండపంలో వేదపండితులు వేద ఆశీర్వచనాన్ని అందించారు.

# హొళగుందలో కామన్న వేడుకలు ప్రారంభం

## ● మగవాళ్ళు మగువలుగా వేషాలతో కుంభాలు మోశారు..నవ్వుల పండుగ





**హొళగుంద,మేజర్‌న్యూస్ః** హొళగుందలో శుక్రవారం సాయంత్రం స్థానిక బోగ్గురు వీధిలో ఉన్న ఉరవకొండ మఠం వద్ద కామన్న వేడుకలను యువకులు ఘనంగా ప్రారంభిం చారు. ఈ నెల 14వ తేదిన హోలీ పౌర్ణమిని పురష్కరించుకుని వారం రోజుల పాటు యువకులు కామన్న వేడుకలను నిర్వహి స్తారు. మఠం వద్ద తోరణాలను కట్టి కామన్న చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. మగవాళ్ళు మగువలుగా వేషాలను వేసి కుంభాలు,కళసలను పట్టారు. యువకులు దున్నపోతును నరకే వేషాలను వేశారు. వేషాలతో బీరప్ప డోళ్ళు,మేళాతాళాలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. మఠం వద్ద దున్నపోతును నరకుతాం భోజనాలకు రావాలని ప్రజలకు సరదాలగా ఆహ్వానించారు. నవ్వల పండుగ కావడంతో వేషాలతో ప్రజల్ని అలరింపు చేశాయి. ఆదేవిధంగా రాత్రి రోగలి బండ దంచుడు కార్యక్రమం నిర్వహించారు. ఇలా వారం రోజుల పాటు చిత్ర విచిత్ర వేషాలతో అలరించే కార్యక్రమాలను నిర్వహించి చివరి రోజున అంటే హోలీ పౌర్ణమి రోజున ఏనుగుల ఊరేగింపు చేసి కామన్న దేవున్ని దహన కార్యక్రమం నిర్వహిస్తారు. వేడుకు కార్యక్రమంలో వీధి యువకులు పాల్గొన్నారు.

# రుణాల బకాయిలు చెల్లించి అభివృద్ధికి సహకరించండి



**దేవనకొండ మేజర్ న్యూస్ :** దేవనకొండ సహకార సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో బకాయిలు చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలని ఛీఫ్ మేనేజర్ సింగం శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక సహకార సంఘం కార్యాలయం నందు మేనేజర్ మల్లికార్జున,సిఇఒ రహంతుల్లాతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యేడాది రైతులు రుణాలకు సంబంధించిన బకాయిల చెల్లింపులు సక్రమంగా రావడం లేదన్నారు. రుణాల చెల్లింపులు నిర్లక్ష్యం చేస్తే మన కార్యాలయ అభివృద్ధితో పాటు అర్హత గల రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయలేమని తెలిపారు. పాత బకాయిలు చెల్లించమని మా శాఖ అధికారులు గత కొన్ని రోజులుగా గ్రామాలలో తిరుగుతున్నారని కానీ రైతులు సహకరించకపోగా సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించడం సరైన పద్ధతి కాదన్నారు.

# 12 న మూగితాత ఉరుసు



**దేవనకొండ మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన దేవనకొండ గ్రామంలో కొలువైన దిగంబర దివానె మూగితాత ఉరుసు ఈ నెల 12వ తేదీ బుదవారం నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. బుదవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండల ప్రజలు,భక్తాదులు సమక్షంలో గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న ఉరుసు ఉత్సవాలలో భాగంగా ఈ యేడాది 11వ తేదీన మంగళవారం గంధం,12వ తేదీన బుధవారం ఉరుసు,13వ తేదీ గురువారం జియారత్ కార్యక్రమాలతో మూగి తాత ఉరుసు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఉరుసు ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే దర్గాకు రంగులు, విధ్యుద్దీపాల తో ముస్తాబుకు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

# 11న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటియుసి నాయకులు

**కర్నూలు నగరం, మేజర్ న్యూస్ ః** రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 11వ తేదీన ఏఐటియుసి అనుబంధ ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి ఆద్వర్యంలో తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి యస్ మునెప్ప కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి అధ్యక్షతన మున్సిపల్ కార్మికుల సమావేశం జరిగింది. ఛలో విజయవాడ కార్యక్రమంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు,ఇంజనీరింగ్ కాంట్రాక్టు సిబ్బంది,ఇతర కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమలలో ఏఐటియుసి నగర కార్యదర్శి జి చంద్రశేఖర్,డిప్యూటీ కార్యదర్శి రామాంజనేయులు,మున్సిపల్ నాయకులు చిన్న అయ్యరాజు,సవారి,నాగేంద్ర,మాణిక్య,వెంకటేశ్వర్లు,గణేష్ , షౌకత్,మహేష్,అమర్‌నాథ్,లక్ష్మీ నారాయణ,సతీష్,బాబు,వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# లోకాన్ని నడిపించే శక్తి స్త్రీ మూర్తి



■ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు

**బండి ఆత్మకూరు రూరల్, మేజర్ న్యూస్ :**

బాధ్యతలలో తను ఆకాశంలో సగమంటుంది,కుటుంబ బంధంలో సర్వం తానే ముందుండి నడిపిస్తూ,ఆసరా అందిస్తూ,బాసటగా నిలుస్తుంది ఆది పరాశక్తి మహిళా మూర్తి. బాధ్యతలైన, బాధలైన అవలీలగా మోస్తూ కేవలం తన కుటుంబ పరిధితోనే తన జీవితాన్ని ముగించకుండా, జన్మభూమి, కర్మభూమి, వేద భూమి కోసం ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడిన మహిళా మృతులు ఎందరో మన దేశంలో పుట్టి సేవలందించారు.మహాకవి గురజాడ చెప్పిన "ఆధునిక స్త్రీ చరిత్రను తిరగరాస్తుంది" అన్న విధంగా నేటి సమాజంలో మహిళా మూర్తి అన్ని రంగాలలో సమానత్వంతో దూసుకొని వెళ్తుంది. జగమంత తానే అమ్మగా, ఇల్లాలుగా ,అక్కగా ,చెల్లెలుగా, ఉపాధ్యాయురాలుగా, అధికారినిగా, రాజకీయ నేతగా సమాజంలో ప్రజా శ్రేయస్సు కోసం తనవంతు కృషి చేస్తుంది.తన కుటుంబీకుల ఆలనా పాలనా తో పాటు, మెట్టింటి గౌరవాన్ని నిలబెడుతూ, ఇంటా బయట వ్యవహారాలను చక్కదిద్దడంలో పురుషునికి ఏమాత్రం తాను తక్కువకానంటూ సంసారాన్ని సజావుగా నడపడంలో తానే ఓ అడుగు ముందుకు వేసిపరాశక్తి గా అందరి కళ్ల ముందర నడుస్తూ నేటి సమాజానికి దిక్సూచి గా మారింది మహిళా మూర్తి. తరతరాల నుండి వస్తున్న సాంప్రదాయాలు, ఆచారాలతో నింపుకపోయినా ఈ ఆధునిక యుగంలో పురుషుల ఆలోచన దృక్పథంలో మార్పులు రావడంతో మహిళ భార్యగా, గృహిణిగా మాత్రమే సేవల నుంచి కాకుండా ఉద్యోగిగా ఆర్థిక సేవలందిస్తూ అనినిత్యం శ్రమిస్తూనే ఉంది స్త్రీ మూర్తి. స్త్రీ తన వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూ స్వాభిమానంతో, ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్తూ నూతన ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్న మహిళామూర్తికి ప్రత్యేక అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలుపుతుంది మీ సూర్య దినపత్రిక.

## మహిళలు సర్వశక్తిమంతులు

### నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి



జిల్లా కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్ న్యూస్ :** జన్మ తః స్త్రీలు శక్తివం తులు సమర్ధవంతులని జిల్లా కలెక్టర్ రాజ కుమారి అన్నాఉ. శుక్ర వారం కలెక్టర్ చాంబర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్క రించుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కలిసిన మీడియా విలేకరులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఉన్నతమైన వ్యక్తిత్వంతో పాటు ఆత్మాభిమానం కలిగి ఉంటారన్నారు. మహిళలు సర్వశక్తివంతులని కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగంలో ఉన్నా, వ్యాపార, రాజకీయ ఇతర రంగాలలో స్థిరపడాలన్నా, ఆయా రంగాలలో ఉత్తమ విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. నిర్దేశించిన ఏ చిన్న నైనా ప్రణాళికాబద్ధంగా నిర్వహించి 100శాతం విజయం సాధించగలిగే సత్తా వారిలో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి స్త్రీ ఏదైనా రంగంలో పట్టు సాధించాలంటే సంబంధిత అంశంపై లోతైన విశ్లేషణ ఉండడంతో పాటు పదిమందికి స్ఫూర్తినిచ్చే విధంగా ప్రశ్నించే తత్వం కలిగి ఉండాలన్నారు. సమాజంలో స్థిరపడిన మహిళ పారిశ్రా మికవేత్తలు వారు ఎదగడమే కాకుండా పదిమందికి ఉపాధి కల్పించే రీతిలో ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. నేటితరం పిల్లలకు కూడా మంచి భవిష్యత్తు ఇవ్వాల్సిన బాధ్యత కూడా స్త్రీలపైనే ఉందని కలెక్టర్ అన్నారు. పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు ఉన్నత శిఖరాలను అధిరోహించి పదిమందికి స్ఫూర్తిదాయకంగా ఉండేలా విద్యార్థులను ఆడపిల్లలను పెంచగలిగే స్థితికి మహిళలు రావాలని కలెక్టర్ కోరారు. కొన్ని సందర్భాలలో మహిళలు అణగదొక్కబడి సమస్యలను చెప్పుకోలేని స్థితిలో ఉన్నారని అలాంటి వారికి కూడా సమాజం సహాయం అందించే స్థితిలో ఉండాలన్నారు. లింగ వ్యవస్థపై చట్టాలు ఉన్నప్పటికీ నిరాశ్రయులైన అనాధ పిల్లలకు సమగ్ర శిశు సంరక్షణ కేంద్రాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

## మహిళలు సమాజంలో స్ఫూర్తిదాయకంగా నిలవాలి

● డిఆర్ఓ వెంకట నారాయణమ్మ



మాట్లాడుతున్న డిఆర్ఓ

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్ న్యూస్ :** మహిళలు సమాజంలో స్ఫూర్తిదాయకంగా నిలవాలని జిల్లా రెవెన్యూ అధికారి సి వెంకట నారాయణమ్మ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ప్రపంచ మహిళా దినోత్సవంను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వీర వనితలుగా సమాజ శ్రేయస్సు కోసం అహర్నిషలు కృషి చేస్తుంటారన్నారు. బాలికలు,మహిళలు చదువుకున్నప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉంటుందన్నారు. విద్య లేకపోతే సమాజంలో మార్పు రాదని పేర్కొన్నారు. అలాగే సమాజం అభివృద్ధి చెందాలంటే స్త్రీ శక్తి అభివృద్ధి చెందాలని అప్పుడే మహిళా సాధికారత జరిగిందనడానికి అర్థం ఉంటుందన్నారు. ఉన్నత ఆశయాలను పెట్టుకొని విద్యార్థినీలు కష్టపడి చదివి తన లాగా ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. యూనివర్సిటీ ఇంచార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పిఎస్ షావలి ఖాన్ మాట్లాడుతూ మహిళలు కేవలం ఒక వస్తువులాగా సమాజం చూస్తుందని దానికి తోడుగా మగవారు కూడా దురాలోచనలతో మహిళలపై అసభ్యంగా మాట్లాడడం వారిపై దురాచారాలకు పాల్పడడం సరైనది కాదన్నారు. మన ఆలోచనలు మారినప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులతో ఉన్నత చదువులు చదువుకుని తమ సొంత కాళ్లపై నిలబడాలన్నారు. తమ యూనివర్సిటీ విద్యార్థిని జాస్మిన్ జహాన్ జాతీయ స్థాయిలో యంగ్ లీడర్ కాంక్లేవ్‌కు రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహించి యూనివర్సిటీకి మంచి పేరు తెచ్చినందుకు ఆమెను అభినందించారు. తోటి విద్యార్థినీలు జాస్మిన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని వీసీ పిలుపునిచ్చారు. అనంతరం ఇంచార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పిఎస్ షావలి ఖాన్ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మకు శాలువా కప్పి జ్ఞాపికను అందచేశారు. ఇంచార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ మహబూబ్ భాషా,యూనివర్సిటీ మహిళా సాధికా రత సెల్ సభ్యులు డాక్టర్ జహనార, డాక్టర్ నిర్మల, విద్య గోదావరి,డాక్టర్ నబియా సుల్తానా,డాక్టర్ అమతుర్ రహీం పాల్గొన్నారు.

## ఆట పాటలతో మహిళ దినోత్సవ వేడుకలు

**బండి ఆత్మకూరు రూరల్, మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక బండి ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యురాళ్లు డాక్టర్ సవిత ,డాక్టర్ భావన రెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి ఆటపాటలతో అలరిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు సవిత, భావన రెడ్డి మాట్లాడుతూ ఈతరం మహిళాలోకం ఉన్నత శిఖరాలను చేరుకుని పురుషులకు తామేమి తీసిపోమని చాటిచెపుతోంది. ఇంటికే పరిమితం కాదంటూ అన్ని రంగాల్లో రాణిస్తున్నార న్నారు.ఇంతా సాధిస్తున్న మహిళలు ఇంకా నిత్యం అణచివేతకు గురవుతూనే ఉన్నారు. అయితే మహిళలు అన్ని రంగాల్లో ముందున్నా సమానత్వం పూర్తిగా లభించలేదన్నారు.నిత్యం ఎక్కడో ఒకచోట మహిళలపై అత్యాచారాలు జరుగుతునే ఉన్నాయి. స్త్రీలు దేశంలో అణచివేతకు గురవుతూన్నారని,స్త్రీల పట్ల మగవారు ఆలోచించే ధోరణి మారాలి, అంగడి బొమ్మగా కాదు వారిలో అమ్మను చూడగలగన్నారు.ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ మాధవి,స్టాఫ్ నర్సు రజియా, ఎంఎల్ హెచ్ పి లు, ఏ ఎన్ ఎమ్ లు,ఆశ వర్కర్లు,సిబ్బంది పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న వైద్యులు,వైద్య సిబ్బంది

## ఘనంగా ముందస్తు మహిళా దినోత్సవం

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** జూపాడుబంగ్లా మండల పరిధిలోని జీవనజ్యోతి మహిళా మండలి సమాఖ్య భవనంలో ఏపీఎం అంబమ్మ ఆధ్వర్యంలో 8వ తేదీ నిర్వహించాల్సిన మహిళా దినోత్సవ వేడుకలు ముందస్తుగా వెలుగు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మహిళా దినోత్సవంలో భాగంగా కేక్ కట్ చేసి మహిళా అధికారులందరూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ దేశ ప్రగతికి పాటుపడుతున్నారని అన్నారు. అటు ఉద్యోగాలలో అభివృద్ధి సాధిస్తూనే, ఇటు కుటుంబ సంక్షేమంతో పాటు పిల్లల విద్య, భవిష్యత్తుకు కృషి చేస్తున్నారని అన్నారు. స్త్రీలు తమ ఓర్పు, నేర్పు, నైపుణ్యంతో ప్రతి రంగంలో అభివృద్ధి బాటలో ముందుకు దూసుకెళ్తున్నారని అన్నారు. ఈ



కార్యక్రమంలో ప్రాథమిక వైద్యాధికారిణి సాబా, హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, హౌసింగ్ ఏఈ జ్యోతి, తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ సరళ, ఏపీవో గౌరీ, వెలుగు సీసీ విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఉమాదేవి, సమాఖ్య అధ్యక్షులు లావణ్య, జంబులమ్మ, పొదుపు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలే ..మహారాణులు..!

## ఆత్మవిశ్వాసంతో ముందుకు..

**మందడి వాణి 26 .కౌన్సిలర్ నందికొట్కూర్**



**పట్టణం :** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి. ప్రస్తుతం 26వ వార్డు కౌన్సిలర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. భర్త రవీంద్రారెడ్డి సహకారంతో ప్రభుత్వ తరపున జరిగే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ నా వార్డులో నెలకొన్న సమస్యలపై గళం విప్పుతూ నన్ను గెలిపించిన వార్డు ప్రజలకు తన వంతు సేవ చేస్తానని తెలిపారు.

**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్ :** సమాజంలో మహిళల స్థానం ఉన్నతమైంది .ఎన్నో రంగాల్లో తమదైన ముద్ర వేస్తూ పురుషులకు దీటుగా అన్ని రంగాలలో మహిళలు రాణిస్తు న్నారు. ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కు కుంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతు న్నారు. ఇంటా.. బయట ఉండే సమస్యలు అధిగమిస్తూ లక్ష్యసాధనలో అసాధారణ ప్రతిభ కనబరుస్తున్నారు. సామాజిక సేవలో సైతం సరిలేరు మీకెవ్వరూ అన్న చందంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వివిధ రంగాల్లో ఉంటూ విశిష్ట సేవలందిస్తున్న మహిళలపై అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సూర్య మేజర్ న్యూస్ లో ప్రత్యేక కథనం. పట్టణ, మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోనూ పురుషులతో పాటు సమానంగా మహిళలు రాణిస్తున్నారు. విద్యా ,వ్యాపార, రాజకీయ, సాహితీ , క్రీడా ఇలా ఏ రంగంలోనైనా చూసినా మహిళలదే అగ్రస్థానం. ఒక మహిళ గృహిణిగా, తల్లిగా, చెల్లిగా, ఉద్యోగినిగా, ప్రజాప్రతి నిధిగా అన్ని రంగాలలో ప్రతిభావంతులుగా ఎలా పని చేస్తున్నారో వారి మాటల్లోనే తెలుసుకుందాం..

## మహిళలు సొంత నిర్ణయాలు తీసుకోవాలి..

**శెట్టిపల్లి .బేబీ మున్సిపల్ కమిషనర్ నందికొట్కూరు :**



మహిళలు ఎలాంటి సమస్య అయినా సొంత నిర్ణయం తీసుకోనే స్థాయికి ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మహిళల్లో నిరక్షరాస్యత నుండి అక్షరాస్యతగా పెరిగిన రోజే పట్టణ ,గ్రామీణ ప్రాంతాలలో నిజమైన అభివృద్ధి కనిపిస్తుంది.

## ఆడపిల్లల పట్ల వివక్ష వద్దు..

**వెంకటేశ్వరమ్మ ఐసిడిఎస్ సూపర్వైజర్ నందికొట్కూరు రూరల్ :**



ఆడపిల్లల పట్ల వివక్షత చూపరాదు. తల్లిదండ్రులు ఆడ ,మగ అనే తేడా లేకుండా చిన్నప్పటి నుండే సమానంగా పెంచాలి. సామాజిక మారిపో ఇంటి నుంచి ప్రారంభం కావాలి. బాలికలు చదువుకున్నట్లయితే సమాజం త్వరత గతిన అభివృద్ధి చెందుతుంది. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారు. మహిళల కోసం అనేక చట్టాలు హక్కులు ఉన్నాయి తెలుసుకోవాలి.

## మహిళలకు అండగా పోలీసు వ్యవస్థ..

**మేరీ జయంతి ..ఏఎస్ఐ.. బ్రాహ్మణ కొట్కూర్ పోలీస్ స్టేషన్ :**



నేటి సమాజంలో మహిళలు ధైర్యంగా వివిధ రంగాలలో ముందుకు దూసుకెళ్లేందుకు పోలీస్ వ్యవస్థ అండగా ఉంటుంది. అన్నీ తెలిస్తే సంఘటన జరిగినప్పుడు న్యాయ పరంగా ఎదుర్కొనే వీలుంటుంది. మహిళలు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా ఒక లక్ష్యంతో చదివి బంగారు భవిష్యత్తు నిర్మించుకోవాలన్నారు. మహిళలు ధైర్యంగా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావచ్చు అని మహిళా రక్షణ కోసం పోలీసులు నిరంతరం సహకారం అందజేస్తారు.

## ధైర్యంగా పోరాడాలి..

**పి .వేణు మాధురి .. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నందికొట్కూరు :**



బాలికలు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యం ఏర్పాటు చేసుకొని దానిని సాధించడానికి ముందడుగు వేయాలని. ఈ ప్రయాణంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటిని దీటుగా ఎదుర్కొని ముందుకు సాగాలి.

## వివిధ రంగాలలో రాణించాలి..

**కె. రాజేశ్వరి దేవి.. వ్యాయామ ఉపాధ్యా రాలు వడ్డెమాన్ :**



నేటి సమాజంలో మహిళలు. పురుషులతో పాటు సమానంగా వివిధ రంగాల్లో రాణి స్తున్నారు. బాలికలను తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివిస్తే చాలు వారి కాళ్లపై వారి జీవించడంతో పాటు పదిమందికి జీవన ఉపాధి కల్పిస్తారు. బాలికలను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో విజయాలు సాధించగలరు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలి




**నంద్యాల కల్చరల్, మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణం లోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమా నికి ముఖ్య అతిథిగా జిల్లా రవాణాశాఖ అధికారిణి ఐశ్వర్యారెడ్డి హాజరుకాగా కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ సుబ్బయ్య, విజయకుమారి, డైరెక్టర్ హేమంత్‌రెడ్డిలు పాల్గొన్నారు ఈసందర్భంగా ఆర్‌టీఓ ఐశ్వర్యారెడ్డి మాట్లాడుతూ మహిళలు ఏ విధంగా ముందుకు రావాలో వివరించారు. మహిళా సాధికారత థీమ్‌పై ఇన్‌స్టాగ్రామ్ రియల్ మేకింగ్ యూట్యేబ్ వీడియోలను పోస్టర్ చేస్తూ మహిళా దినోత్సవాన్ని ఒకేరోజు జరుపుకోకూదని మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని బాలురకు కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రిన్సిపల్ సుబ్బయ్య మాట్లాడుతూ మహిళల పట్ల ఎలాంటి సంఘటనలు జరుగుతున్నా మహిళలకు సాధికారత అవసరమని ఆయన అన్నారు. సివిల్ సర్వీస్ పరీక్షల్లో ఐశ్వర్యారెడ్డిని రోల్‌మోడల్‌గా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులను నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి మెమోంటోలు అందజేశారు.

## ఆస్తిలో హక్కు కల్పించిన నాయకుడు ఎన్‌టిఆర్



పురస్కారం అందుకున్న వారిని సన్మానిస్తున్న దృశ్యం

**కర్నూలు కల్చరల్, మేజర్ న్యూస్ :** 1987లో మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించిన నాయకుడు ఎన్‌టిఆర్ అని ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం కొన్ని మార్పులు చేసి పురుషులతో పాటు మహిళలకు హక్కు కల్పించారని లీగల్ సెల్ జడ్జి వెంకట శేషాద్రి తెలిపారు. శుక్రవారం స్థానిక టీజీవి కళాక్షేత్రంలో కళాసౌరవ నారీ శక్తి పురస్కార ప్రధానం జరిగింది. ఈ కార్యక్రమానికి సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఆది లక్ష్మి, విజయరెడ్డితో పాటు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య,డిఎస్పీ మహబూబ్ భాషాలు పాల్గొని ప్రసంగించారు. నారీ శక్తి పురస్కారాలను అందుకు న్న వారిని నట రాజ నృత్యం కలామందిరంఅధ్యక్షులుకరీముల్లా బృందం ఘనంగా సత్కరించారు.

## మహిళలు కుటుంబాన్ని,సమాజాన్ని పటిష్టంగా

# నిలబెట్టే శక్తి కలవారు..!

**– కిమ్స్ కడల్స్ ఆసుప్రతి కన్సల్టెంట్ అబ్‌స్ట్రిషన్, గైనకాలజిస్ట్ డాక్టర్ వై.కుసుమ**



**కర్నూలు, మేజర్ న్యూస్ :** మహిళలు కుటుంబాన్ని,సమాజాన్ని పటిష్టంగా నిలబెట్టే శక్తి కలవారని కిమ్స్ కడల్స్ ఆసుప్రతి కన్సల్టెంట్ అబ్‌స్ట్రిషన్,గైనకాలజిస్ట్ డాక్టర్ వై కుసుమ అన్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆమె మాట్లాడుతూ ప్రతి దశలోనూ బాలికలు,మహిళలు కొన్ని ప్రత్యేకమైన అవసరాలు, అవకాశాలు ఉంటాయని, వాటి ద్వారా వాళ్లు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. బాల్యం ,కౌమారం,పిల్లలు పుట్టే వయసు, మెనోపాజ్, ఆ తర్వాతి దశల్లో మహిళలు తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. అలాగే మారుతున్న జీవనశైలిలో ఆహారపు అలవాట్లు కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతాయన్నారు. ముఖ్యంగా ఐటి సెక్టార్లలో పనిచేసే వారు ఎక్కువ సేపు కూర్చున్న సీటుకే పరిమితం కావడం,అక్కడి కార్యాలయాల్లో అందుబాటులో ఉండే జంక్ ఫుడ్,ఫాస్ట్ ఫుడ్స్ తినడం తగినంత శారీరక శ్రమ లేకపోవడం వల్ల అనేక రకాల సమస్యలు తలెత్తుతాయన్నారు. బాల్యంలో అన్నిరకాల టీకాలు వేయించడంతో పాటు రూబెల్లా వ్యాక్సిన్ కూడా అందేలా చూడాలన్నారు. అంతేకాకుండ హెచ్‌పివి వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల సర్వైకల్ క్యాన్సర్‌ని నివారించవచ్చన్నారు. బాలికలకు రుతుక్రమ ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం చాలా ముఖ్యమన్నారు. పీరియడ్స్ సమయంలో అధిక రక్తస్రావం వల్ల రక్తహీనతను నివారించడంపై కూడా దృష్టి పెట్టాలన్నారు. అలాగే నేటి ప్రపంచంలో మహిళల పునరుత్పత్తి,లైంగిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. కౌమారదశలో ఉన్న వారు ఆసక్తిగా ఉన్నప్పుడు వారి హార్మోన్లు పెరుగుతున్నప్పుడు ఇంటర్‌నెట్‌లో పుష్కలంగా సమాచారం అందుబాటులో ఉందని కానీ అదంతా సరైన సమాచారం కావచ్చు లేదా కాకపోవచ్చునని వారికి సురక్షితమైన గర్భ నిరోధకాలను అందించడం, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధులు, అసురక్షిత గర్భ స్రావాలపై సరైన సమాచారాన్ని అందించడం ముఖ్యమన్నారు. తద్వారా వారు భవిష్యత్తులో క్యాన్సర్, వంధ్యత్వం వంటి తీవ్రమైన అనారోగ్యాల బారిన పడకుండ నివారించవచ్చునన్నారు. మీ ఆరోగ్యం, మీ శక్తి, మీ భవిష్యత్తు ఈ మహిళా దినోత్సవాన్ని సొంత ఆరోగ్యాన్ని,శ్రేయస్సును కాపాడుకునే శుభసందర్భంగా మార్చుకుందామన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**– మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్**



**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని మండల వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం నందు శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకొని మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళా సిబ్బందితో కార్యక్రమాన్ని నిర్వహించి తదనంతరం ఆయన మాట్లాడుతూ దైర్యం, సంకల్పం, దయ మహిళలకు ఉన్న ఈ గుణాలే ప్రపంచాన్ని ప్రకాశవంతం చేస్తున్నాయని, మహిళలు సాధించిన విజయాలు అభినందించేందుకు లింగ సమానత్వంపై అవగాహన కల్పించేందుకు మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాలని అన్నారు. 2025 మహిళా దినోత్సవాన్ని ప్రతి మహిళకు, బాలికకు హక్కులు, సమానత్వం, సాధికారత దిశగా అడుగులు వేయాలని ఆయన అన్నారు. మహిళలే సృష్టికి మూలమని, ఓర్పు, సహనం, కుటుంబ ఎదుగుదలతో వారి పాత్ర మహా గొప్పదని అన్నారు. మహిళలను గౌరవించే బాద్యత ప్రతి పౌరుడిపై ఉందని ఆయన అన్నారు. వ్యవసాయ మహిళా సిబ్బందిని ఆయన మెమొంటోతో సత్కరించారు. ఈకార్యక్రమంలో ఏఈవోలు సుధారాణి, అంజిత్‌కుమార్‌రెడ్డి, అన్ని రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి మహిళ సమాజంలో గౌరవించబడాలి



మహిళా ఉపాధ్యాయులకు చీరె, సారె అందజేసిన దృశ్యం

**మహానంది, మేజర్‌న్యూస్ :** సృష్టికి మూలమైన మహిళ సమాజంలో ప్రతి మహిళ గౌరవించబడాలని కరస్పాండెంట్ మల్లెల శ్రీను పేర్కొన్నారు. శుక్రవారం మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకొని గాజులపల్లి శివరామకృష్ణ విద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మహిళా ఉపాధ్యాయురాలకు చీరె, సారెను అందజేశారు. సమాజంలో మహిళ పాత్రపై కరస్పాండెంట్ వివరించారు.

# AP TET Paper IIA

## Prevoius Paper (Held on 17/10/2024)

**1. కుడిచేతితో రాయగలిగిన వ్యక్తి ఎడమచేతితో కూడా రాయగలగడం**
1. అనుకూల బదలాయింపు
2. ద్విపార్శ్వ బదలాయింపు
3. ప్రతికూల బదలాయింపు
4. శూన్య బదలాయింపు

**2. పునస్మరణ, పునశ్చరణ, పునరభ్యసనంను ప్రోత్సహించే నియమం**
1. సంసిద్ధతా నియమం
2. ఫలిత నియమం 3. అభ్యాస నియమం
4. అవిరళ నియమం

**3. ప్రజాస్వామ్యం అనేది**
1. మూర్తభావన
2. ఆకార భావన 3. సాంఘిక భావన
4. అమూర్త భావన

**4. మిన్నెసోటా మల్టీఫెసిక్ పర్సనాలిటీ ఇన్వెంటరీ (ఎమ్ఎమ్‌పిఐ) లో ప్రశ్నల సంఖ్య**
1. 10 2. 110
3. 505 4. 550

**5. ఎన్ఆర్‌బిసి అనగా**
1. నేషనల్ రెసిడెన్షియల్ బేస్డ్ సెంటర్స్
2. నాన్ రెసిడెన్షియల్ బ్రిడ్జ్ కోర్స్
3. నేషనల్ రిహాబిలిటేషన్ బేస్డ్ సెంటర్స్
4. నాన్ రిహాబిలిటేషనల్ బేస్డ్ కోర్స్

**6. క్రింది వానిలో సరికాని జత**
1. సమరూప మూలకాల సిద్ధాంతం – థర్‌స్టన్
2. సామాన్యీకరణ సిద్ధాంతం – చార్లెస్ జడ్
3. ఆదర్శాల సిద్ధాంతం – బాగ్లే
4. ట్రాన్స్ పొజిషన్ సిద్ధాంతం – గెస్టాల్ట్ వాదులు

**7. పెరుగుదలకు సంబంధించినది**
1. ప్రాగుక్తీకరించవచ్చును
2. నిరంతర ప్రక్రియ
3. మాపనం చేయవచ్చు 4. సమగ్రమైనది.

**8. పిల్లల గ్రాహ్యక పరీక్ష క్రింది వయస్సు వారికి ఉద్దేశించబడినది**
1. 6–10 సంవత్సరాలు
2. 2–13 సంవత్సరాలు 3. 3–10 సంవత్సరాలు
4. 5–12 సంవత్సరాలు

**9. నిష్పాదన పరీక్షకు ఉదాహరణ**
1. భాటియా ప్రజ్ఞ పరీక్ష
2. బినే–సైమన్ పరీక్ష 3. ఆర్మీ–ఆల్ఫా పరీక్ష
4. వెష్లర్ ప్రజ్ఞా పరీక్ష

**10. నిర్నిబంధిత ఉద్దీపనకు, నిబంధిత ఉద్దీపనను జోడించి నిబంధిత ప్రతిస్పందనను బలపడేటట్లు చేయడం**
1. అయత్న సిద్ధ స్వాస్థ్యం
2. ఉన్నత క్రమ నిబంధన
3. పునర్బలన నియమం
4. సాధారణీకరణ నియమం

**11. డౌన్స్ సింట్రోమ్ అనేది**
1. క్రోమోజోముల లోపం
2. థైరాయిడ్ లోపం 3. ఎంజైమ్ లోపం
4. నరాల బలహీనత

**12. వారసత్వ సంక్రమణకు మూలకారణం**
1. హార్మోన్ 2. డిఎన్ఎ
3. సైటోప్లాజమ్ 4. ఎంజైమ్స్

**13. క్రింది వానిలో మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులు అందజేసే సంస్థ కానిది**
1. కోర్సు ఎరా 2. ఉడాసిటీ
3. ఖాన్ అకాడమీ 4. ఎడ్‌రా

**14. ప్రత్యక్షంనకు సంబంధించి సరికాని ప్రవచనం**
1. సమన్వయ ప్రక్రియ
2. అవధాన, ఆలోచన ఇమిడి ఉంటాయి
3. నిశిత పరిశీలన ఉండదు
4. నేరుగా నిర్ధారించలేము.

**15. శిశువు ముందు క్రేయాన్‌లను పట్టుకోవటం, తరువాత ఆకారాలు చిత్రించడం అనేది క్రింది వికాస నియమాన్ని సూచిస్తుంది.**
1. వికాసాన్ని ప్రాగుక్తీకరించవచ్చును.
2. వికాసం పరస్పర సంబంధంగా కొనసాగును
3. వికాసం ఒక ఖచ్చితమైన దిశగా కొనసాగును.
4. వికాసం సాధారణ దిశ నుండి నిర్దిష్ట దిశగా సాగును.

**16. అభ్యసనం మందకొడిగా జరిగే దశ**
1. పీఠభూమి దశ 2. ప్రారంభ దశ
3. చాంచల్య దశ 4. లాక్షణిక దశ

**17. ఆర్‌టిఇ యాక్ట్ 2009 చట్టంలో ఉన్నవి**
1. 5 అధ్యాయాలు, 32 సెక్షన్లు
2. 6 అధ్యాయాలు, 30 సెక్షన్లు
3. 7 అధ్యాయాలు, 38 సెక్షన్లు
4. 3 అధ్యాయాలు, 21 సెక్షన్లు

**18. పొదుపు గణన సూత్రం**
1. (మొత్తం అభ్యసన ప్రయత్నాలు – తప్పు అభ్యసన ప్రయత్నాలు/ మొత్తం అభ్యసన ప్రయత్నాలు) ×100
2. (పునరభ్యసన ప్రయత్నాలు–అసలు ప్రయత్నాలు/ అసలు ప్రయత్నాలు)×100




3. (మొత్తం అభ్యసన ప్రయత్నాలు–ఒప్పు అభ్యసన ప్రయత్నాలు/మొత్తం అభ్యసన ప్రయత్నాలు)×100
4. (అసలు ప్రయత్నాలు–పునరభ్యసన ప్రయత్నాలు/ అసలు ప్రయత్నాలు)×100

**19. "విద్య ద్విధ్రువ ప్రక్రియ" అన్నవారు**
1. జాన్‌డ్యూయి 2. పియర్సన్
3. జాన్ ఆడమ్స్ 4. ఒ.బి. స్మిత్

**20. ఎన్ఇపి–2020 ప్రకారం మాధ్యమిక దశ వయస్సు**
1. 11–14 సంవత్సరాలు
2. 14–18 సంవత్సరాలు
3. 8–11 సంవత్సరాలు
4. 16–18 సంవత్సరాలు

**21. చైల్డ్ లైన్ టోల్‌ఫ్రీ నెంబరు**
1. 104 2. 1234
3. 108 4. 1098

**22. క్రింది వానిలో ఉన్నత స్థాయి మానసిక ప్రక్రియ**
1. ప్రశ్నించడం 2. విశ్లేషించడం
3. పరిశీలించడం 4. పోల్చడం

**23. పాఠశాల స్థాయిలో పిల్లలు ఉత్తీర్ణులు కాకపోవటానికి కారణాలను జాన్‌హోల్ట్ అనే విద్యావేత్త ఎ,బి,సి లుగా వివరించాడు. ఇందులో ఎ,బి,సిలు అనగా**
1. ఎ–ఎఫ్రైడ్, బి–బోర్‌డమ్, సి–కన్‌ఫ్యూజన్
2. ఎ–ఎచీవ్‌మెంట్, బి–బేసిక్, సి–కమ్యూనికేషన్
3. ఎ–ఎట్రాక్టివ్, బి–బేస్, సి–క్లాసిఫికేషన్
4. ఎ–ఏవరేజ్, బి–బెస్ట్, సి–చిల్డ్రన్ హూ నీడ్స్ సపోర్ట్

**24. 1 వైబి విలువ**
1. 1024 ఇబి 2. 1024 టిబి
3. 1024 జిబి 4. 1024 జడ్‌బి

**25. ప్రేరేపిత విస్మృతి అనేది క్రింది రక్షక తంత్రము**
1. ప్రక్షేపణం 2. హేతుకీకరణం
3. దమనం 4. విస్థాపనం

**26. పూర్వ వయోజన దశలో కనిపించే సద్గుణం (ఎరిక్‌సన్ ప్రకారం)**
1. ప్రేమ 2. విశ్వసనీయత
3. సంరక్షణ 4. సూక్ష్మబుద్ధి

**27. క్రింది వానిలో భాషా నైపుణ్యం కానిది**
1. వినడం 2. మాట్లాడడం
3. ప్రశ్నించడం 4. కథలు చెప్పడం

**28. విద్యార్థులు అర్థం చేసుకోకుండా సంస్కృత శ్లోకాలు వల్లించడం**
1. నిష్క్రియాత్మక స్మృతి
2. తార్కిక స్మృతి 3. బట్టీ స్మృతి
4. స్వల్పకాలిక స్మృతి

**29. 'సంధి దశ' అని పిలిచే దశ**
1. నవజాత శిశువు దశ 2. శైశవ దశ
3. పూర్వబాల్య దశ 4. కౌమార దశ

**30. నైతిక తీర్పులను చేసే నియంత్రణశక్తి అధికంగా అంతర్లీనం అయ్యే కోల్‌బర్గ్ నైతిక వికాస దశ**
1. 4వ దశ 2. 3వ దశ
3. 6వ దశ 4. 5వ దశ

**31. కుక్షిని నిఖిల జగంబుల**
**నిక్షేపము జేసి ప్రళయ నీరధి నడుమన్**
**రక్షక వటపత్రముపై**
**దక్షత పవళించునట్టి ధన్యుడు కృష్ణా!**
**'వటపత్రము' అనగా**
1. రావి ఆకు 2. మర్రి ఆకు
3. తమలపాకు 4. అరటాకు

**32. 'ఎదలోపలి యెదలో నెమ్మదిలో జీవిత రహస్య మార్గమ్ములలో' నుండి పుట్టినది భావకవిత. దీనినొక ప్రత్యేక మార్గముగా ననుష్ఠించినవారు నవ్య కవులే. కనుక దెనుగు సారస్వతమునకు సంబంధించినంతవరకే భావకవిత యొక నూతన ప్రక్రియ యనియు నీ యుగము యొక్క విలక్షణత యనియు నంగీకరింపక తప్పదు.**
**పై గద్యాన్ని అనుసరించి అసత్యాన్ని గుర్తించండి.**
1. భావ కవిత నూతన ప్రక్రియ
2. భావకవిత ఈ యుగానికి విలక్షణత
3. భావకవితను ప్రత్యేక మార్గముగా అనుష్ఠించింది నవ్యకవులు
4. జీవిత రహస్య మార్గాల నుండి భావకవిత పుట్టలేదు.

**33. మన భారతీయలిపి కూడా చాలా ప్రాచీనమైనదని, చిత్రలిపి నుంచే స్వతంత్రంగా పరిణమించినదని పలువురు ప్రాచ్య పాశ్చాత్య విద్వాంసుల విశ్వాసం. మనకు ప్రాచీనతమ సాహిత్యమైన ఋగ్వేదంలోను, శతపథ బ్రాహ్మణంలో ఉన్న అక్షర, వర్ణ చర్చను బట్టి మనకు లేఖన పద్ధతి ఉండి ఉంటుందని ఊహించడానికి అవకాశముంది. క్రీస్తుకు పూర్వం 8వ శతాబ్ది వాడైన పాణిన్యాచార్యుడు అష్టాధ్యాయిలో లిపి, లిపికర శబ్దాలను, యవనానీ అనే లిపి విశేషాన్ని తెలిపాడు.**
**భారతీయ లిపికి మూలం**
1. లిపికర 2. గుప్తలిపి
3. చిత్రలిపి 4. స్వర్ణలిపి

**34. కాదు సుమీ దుస్సంగతి**
**పోదుసుమీ కీర్తికాంత పొందిన పిదపన్**
**వాదు సుమీ యప్పిచ్చుట**
**లేదు సుమీ సతుల వలపు లేశము సుమతీ!**
**పై పద్యంలో కలహానికి కారణమయ్యేది**
1. చెడు స్నేహం 2. అప్పునిచ్చుట
3. కీర్తికాంత 4. లేశము

**35. ఇదంతా చూస్తూ నిలబడిపోయాను నేను. ఈ వాక్యంలో 'చూస్తూ' అనేది**
1. అప్యర్థకం 2. క్వార్థకం
3. చేదర్థకం 4. శత్రర్థకం

**36. 'వలనన్, కంటెన్, పట్టి' అనేవి**
1. ద్వితీయా విభక్తి ప్రత్యయాలు
2. తృతీయా విభక్తి ప్రత్యయాలు
3. షష్ఠీ విభక్తి ప్రత్యయాలు
4. పంచమీ విభక్తి ప్రత్యయాలు

**37. 'అంగట్లో అరువు తల మీద బరువు' అనేది ఒక**
1. సామెత 2. కళారూపం
3. జాతీయం 4. పొడుపుకథ

**38. 'పరోపకారం' ఇతివృత్తంగా గల పాఠం**
1. ఏ దేశమేగినా 2. ఇల్లలకగానే
3. ఆకుపచ్చశోకం 4. తీర్పు

**39. 'చిత్రం గురించి వివరించు' అనేది**
1. విధ్యర్థక వాక్యం 2. ఆశీరర్థక వాక్యం
3. ప్రశ్నార్థక వాక్యం 4. వ్యతిరేకార్థక వాక్యం

**40. నన్నయ వీరి ఆస్థాన కవి**
1. మనుమసిద్ధి 2. ప్రౌఢదేవరాయలు
3. నారాయణ భట్టు 4. రాజరాజ నరేంద్రుడు

**41. 'ఆయతి' పదానికి అర్థం**
1. సిద్ధం 2. ప్రభావం
3. పరిగెత్తు 4. పెదవి

**42. 'ఈ మహారాజు సాక్షాత్తూ పరమేశ్వరుడే' ఈ వాక్యంలోని అలంకారం**
1. స్వభావోక్తి 2. ఉత్ప్రేక్ష
3. ఉపమా 4. రూపక

**43. 'మానవా నీ ప్రయత్నం మానవా' అనేది**
1. ఛేకాను ప్రాసాలంకారము
2. లాటాను ప్రాసాలంకారము
3. యమకాలంకారము 4. శ్లేషాలంకారము

**44. 'శీతోష్ణం' అనే పదం ఈ సమాసానికి సంబంధించినది**
1. ద్వంద్వ సమాసం
2. నఞ్ తత్పురుష సమాసం 3. ద్విగు సమాసం
4. విశేషణ ఉభయపద కర్మధారయ సమాసం

**45. 'తీర్పు' పాఠ్యాంశం ఈ గ్రంథం నుండి స్వీకరించడమైనది.**
1. ఉదయశ్రీ 2. కరుణశ్రీ
3 విజయశ్రీ 4. తెలుగుబాల శతకం

**46. 'ఉదకము' పదానికి పర్యాయపదాలు**
1. వనము, జనుము
2. సలిలము, జలము 3. తగరము, సీసము
4. తల్పము, కల్పము

**47. 'తోయజము' పదానికి వ్యుత్పత్త్యర్థం**
1. భూమి నుండి పుట్టునది
2. పద్మములకు నిలయమైనది
3. నీటియందు పుట్టినది
4. శాలము నుండి జనించునది

**జవాబులు :**

1)2, 2)3, 3)4, 4)4, 5)2, 6)1, 7)2, 8)3, 9)1, 10)3, 11)1, 12)2, 13)4, 14)3, 15)4, 16)3, 17)3, 18)4, 19)3, 20)2, 21)4, 22)2, 23)1, 24)4, 25)3, 26)1, 27)3, 28)3, 29)4, 30)3. 31)1, 32)4, 33)3, 34)2, 35)4, 36)4, 37)1, 38)4, 39)1, 40)4, 41)2, 42)4, 43)3, 44)4, 45)2, 46)2, 47)3

## రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ఎల్ కె ఆర్ స్కూల్ విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో తెనాలిలో జరిగినటువంటి రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో ఎల్ కె ఆర్ గ్లోబల్ స్కూల్ విద్యార్థి మోక్షిత్ (మూడవ తరగతి) అండర్ 22 కేజీ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, కోఆర్డినేటర్స్, ఏవో, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

**రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో ఎల్ కె ఆర్ స్కూల్ విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ :** ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారిచే విజయవాడ దగ్గర కంచికచర్లలో నిర్వహించినటువంటి రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో అండర్ 14 విభాగంలో ఎల్ కె ఆర్ గ్లోబల్ స్కూల్లో ఆరవ తరగతి చదువుతున్న విగ్నేష్ అత్యుత్తమ ప్రతిభ కనపరిచి బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, కోఆర్డినేటర్స్, ఏవో, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**పాములపాడు మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పాములపాడు తహసిల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పాములపాడు తహసిల్దార్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులు వీఆర్వోలతో కలిసి తహసిల్దార్ సుభద్రమ్మ కేక్ కట్ చేసి మహిళా దినోత్సవం జరుపుకున్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ పురుషులతో సమానంగా పోటీపడి, నిజజీవితంలో ఎన్నో శిఖరాలను అధిరోహిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు రీ సర్వే డిప్యూటీ ఎమ్మార్వో సుప్రియ, ఆర్ఐ ఖాజాబీ, డిప్యూటీ ఎమ్మార్వో పటాన్ బాబు, వీఆర్వోలు ముర్తుజావలి కలీముల్లా శివన్న, మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లెపల్లిలో గాలికుంటు వ్యాధి మందులు పంపిణీ



నట్టల నివారణ మందులను తాపుతున్న దృశ్యం

**వెల్దుర్తి ,మేజర్ న్యూస్:** మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామంలో శుక్రవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను జాగ్రత్తగా వేయించుకోవాలని పశుసంవర్ధక శాఖ కర్నూల్ డిడి దుర్గా ప్రసన్న బాబు తెలిపారు.వెల్దుర్తి పశు వైద్యాధికారినిశాంతాలతఆధ్వర్యంలో ఆవులకు ,ఎద్దులకు,గేదెలకు ,మేకలకు ,గొర్రెలకు గాలికుంటు వ్యాధి నివారణ మందులను ఇంటింటి కి వెళ్లి టీకాలను వేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి నెల నుండి ఏప్రిల్ వరకు ఎక్కువగా గాలికుంటు వ్యాధి సోకే లక్షణాలున్నాయన్నారు. గాలికుంటు వ్యాధి సోకిన జీవాలను మంద నుండి వేరు చేయాలన్నారు.

## పశు వైద్య కేంద్రాన్ని పరిశీలించిన డిప్యూటీ డైరెక్టర్



**కృష్ణగిరి,మేజర్న్యూస్ :** మండల కేంద్రమైన కృష్ణగిరిలో పశు వైద్య కేంద్రాన్ని జిల్లా పశు సంవర్ధక శాఖ డిడి దర్గా ప్రసన్న బాబు,శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు సోకే గాలికుంటు వ్యాధి టీకాను పరిశీలించారు.ఈ నెల 1 నుండి 30 వరకు పశువులకు సోకే గాలికుటంటు వ్యాధి నివారణ కోసం టీకాను ఇస్తున్నామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కృష్ణగిరి వెటర్నరీ డాక్టర్ నవీన్‌తో పాటు ఇంకా పలువురు పాల్గొన్నారు.

## మోడల్ స్కూళ్లలో ఆరో తరగతికి ప్రవేశాలు

**పాములపాడు మేజర్ న్యూస్ :** ఏపీ మోడల్ స్కూళ్లలో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ బాలాజీ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీ వరకు ఆన్లైన్ లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అద విధంగా ఏప్రిల్ 20 తేదీన పరీక్షలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. విద్యార్థులు చదువుకో వడానిక ఎలాంటి పరీక్షల ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కేవలం ప్రవేశ పరీక్షల కోసం ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 150, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ. 75 చెల్లించాలన్నారు. ఆన్లైన్లో నమోదు చేసుకోవాలన్నారు.

## ఆస్తిలో హక్కు కల్పించిన నాయకుడు ఎన్టీఆర్

**కర్నూలు కల్చరల్, మేజర్ న్యూస్ :** 1987 సంవత్సరంలో మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించిన నాయకుడు ఎన్టీఆర్ అని, ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం కొన్ని మార్పులు చేసి పురుషులతోపాటు మహిళలకు హక్కు కలిగించారని లీగల్ సెల్ జడ్జి వెంకట శేషాద్రి తెలిపారు శుక్రవారం రాత్రి స్థానిక టీజీవి కళాక్షేత్రంలో కళాసౌరవ నారీ శక్తి పురస్కార ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్లు ఆదిలక్ష్మి, విజయ రెడ్డి తోపాటు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, డీఎస్పీ మహబూబాషా పాల్గొని ప్రసంగించారు. అనంతరం నారీ శక్తి పురస్కార గ్రహీతలను నటరాజ నృత్యం కళామందిరం అధ్యక్షులు కరీముల్లా బృందం ఘనంగా సత్కరించింది.అంతకుముందు నృత్య ప్రదర్శనలు జరిగాయి. సన్మానం అందుకున్న వారు మహిళా సిఐలు ఆదిలక్ష్మి, విజయ రెడ్డి, జ్యోతిర్మయి, సునీత, జ్ఞానేశ్వరి,మల్లేశ్వరి, స్వప్నశ్రీ, విజయలక్ష్మి, విద్యా వైష్ణవి అనితా దేవి, సరళ, మాధవి లత, సరోజ, నాగమల్లేశ్వరి,చంద్రమౌళిని, లీలావతి,రమ్య బాయ్ ఉన్నారు.

## శ్రీ సంకల్ప్ పాఠశాలలో ఘనంగా ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు




**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** పట్టణంలోని బాలాజి కాంప్లెక్స్ లో ఉన్న శ్రీ సంకల్ప్ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ సంకల్ప్ పాఠశాలల ఛైర్మెన్ సుధాకర్, ప్రిన్సిపాల్ రమ్యా రెడ్డి, విద్యార్థులు వారి మాతృమూర్తులు , బోధన , బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. అతిథులకు మహిళా ప్రత్యేకతతో తీర్చిదిద్దిన రంగవల్లులతో, పుష్పాలతో, సెల్ఫీ ఫోటో బోర్డుతో మాతృమూర్తులకు ఘన స్వాగతం పలికారు. వినోద క్రీడా పోటీలు ,అంత్యాక్షరి పాటల పోటీలు, నృత్య పోటీలతోపాఠశాల ప్రాంగణమంతా కోలాహలంతో సందడి చేశారు.వచ్చిన అతిథులకు అల్పాహారాలు,శీతల పానీయాలుఅందజేశారు.విద్యార్థులు వేసిన నృత్యాలు, గీతాలు, స్కిట్స్ , మహిళా గొప్పతనాన్ని ఔదార్యాన్ని చాటి చెప్పు అందరినీ అబ్బురపరిచాయి.పాఠశాల ప్రిన్సిపాల్ రమ్యారెడ్డిని పాఠశాల సిబ్బంది శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. తదుపరి పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ప్రిన్సిపాల్ రమ్యారెడ్డి మాట్లాడుతూ మహిళా ఇంటా బయట ఓర్పుతో నేర్పుతో నిరంతరం శ్రమిస్తూ అన్నీ రంగాలలో రాణిస్తూ సమాజాభివృద్ధి కోసం పాటుపడుతున్నారని తెలిపారు. తల్లిగా, చెల్లిగా , అక్కగా , బిడ్డగా , కోడలిగా , అత్తగా ఇలా ఎన్నో పాత్రలతో బాధ్యతగా తన కర్తవ్యాన్ని నెరవేర్చేది "స్త్రీ" మాత్రమే అని కొనియాడారు.

## బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన నంద్యాల సబ్ కలెక్టర్



బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** అహోబిలంలో జరుగుతున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో ఏర్పాట్లను శుక్రవారం నంద్యాల సబ్ కలెక్టర్ విశ్వనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అహోబిలం క్షేత్రంలోని వసతి సౌకర్యాలు ఏర్పాట్లను మండల తహసిల్దార్ జ్యోతి రత్నకుమారి తో కలిసి తనిఖీ చేశారు. బీగాల ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణం వద్ద రోడ్డును ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసిన వ్యాపారులు వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించారు. వారికి కేటాయించిన ప్రాంతంలోనే దుకాణాలు నడుపుకోవాలని సబ్ కలెక్టర్ విశ్వనాథ్ సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగరాదని అధికారులను ఆదేశించారు. అనంతరం అహోబిలంలో వెలసిన శ్రీ ప్రహ్లాద వరద స్వామి, శ్రీ అమృతవల్లి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 46 వ పీఠాధిపతి శ్రీ రంగనాథ యతేంద్ర మహాదేశికన్ స్వామివారిని కలిసి స్వామి వారిని కూడా దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

## సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించిన జెడ్పి సిఇఓ



ట్యాంక్ పరిశీలిస్తున్న జిల్లాకార్య నిర్వహణ అధికారి

**మిడుతూరు మేజర్ న్యూస్ :** మిడుదూరు మండల కేంద్రంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ని శుక్రవారం కర్నూల్ జిల్లాకార్యనిర్వహణాధికారి సీఈఓ నాసర రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలకు తాగునీరు పంపించేసి విధానాన్ని గమనించారు. నీటి నిల్వ బెడ్ల శుభ్రతను పాటించాలని గ్రామాలకు వెళ్లే పైపులైను లీక్ కాకుండా చూసుకోవాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. నీటి పంపిణీ విధానాన్ని పరిశీలించడం జరిగింది సదరు సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నుండి నీరు సరఫరా అయ్యే గ్రామాల సంబంధిత పంచాయతీ కార్యదర్శుల నుండి తెలుసుకోవడం జరిగింది మరియు సదరు నీటి పంపిణీ పై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి ఉన్నారు అదేవిధంగా 15వ ఆర్థిక సంఘం నిధులు మరియు మండల పరిషత్ సాధారణ నిధులు ఒక నెల లోపల పనులు చేపట్టి పూర్తి చేసివివరాలు అందచేయవలసినదిగా ఆదేశించారు.డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి ఎంపీడీవో దశరథ రామయ్యఅసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విశ్వనాథ్ ఈవోఆర్ డి. సంజన్న గ్రామపంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

## పేరుసోములలో తిరగబడ్డ మాదిగ మహిళలు



తహశీల్దార్ అనిల్ కుమార్‌కు వినతీపత్రం అందజేస్తున్న మహిళలు

**సంజామల మేజర్,న్యూస్ః** సంజామల మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో ఉన్నటువంటి టీడీపీ నాయకులు స్మశాన వాటిక దారిని అక్రమంగా ఆక్రమించారని పేరుసోముల గ్రామంలో ఉన్నటువంటి మాదిగ మహిళలు ఆక్రమించిన గోడను కూల్చివేశారు. దాదాపు రెండు మూడు నెలలుగా రస్తా ఆక్రమణకు గురైందని చాలాసార్లు తహశీల్దార్, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం తహశీల్దార్ అనిల్ కుమార్‌కు అక్రమ గోడ నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఎం.ఆర్.పి.ఎస్ మండల అద్యక్షుడు కంబగిరి వినతీపత్రం అందజేశారు. సాయంత్రం మాదిగల స్మశాన వాటిక దారిలో నిర్మిస్తున్నారన్న సమాచారంతో 40మంది మాదిగ మహిళలతో అక్కడికి చేరుకొని అక్రమంగా నిర్మిస్తున్న గోడని కూల్చివేశారు. అనంతరం మాదిగ మహిళలు తహశీల్దార్ అనిల్ కుమార్‌కు వినతీపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మాదిగ స్మశాన వాటిక రస్తాను పేరుసోముల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆక్రమించుకొని గోడలు నిర్మించుకున్నారు. రస్తా సమస్యను పరిష్కరించాలని సంజామల తహశీల్దార్ అనిల్ కుమార్‌కు మరియు కలెక్టర్లకు వినతీపత్రం అందజేయడం జరిగింది. కానీ ఎలాంటి పరిష్కారం మాకు జరగలేదని భావిస్తున్నారు.

## స్టేట్ బ్యాంక్‌ను కిందకు మార్చాలి

**– స్టేట్‌బ్యాంక్ ముందు సిపిఎం పార్టీ నాయకులు ధర్నా**

**కోసిగి మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన కోసిగిలో ఉన్న భారతీయ స్టేట్‌బ్యాంక్‌ను పై అంతస్తు నుండి కింది మార్చాలంటూ సిపిఎం పార్టీ నాయకులు ధర్నా చేపట్టారు. నాయకులు రాముడు, వీరేష్ మాటాడుతూ బ్యాంక్ పై అంతుస్తులో ఉండడం వల్ల వృద్ధులకు, వికలాంగులకు ముఖ్యంగా గర్భిణిలకు చాలా ఇబ్బందిగా మారిందన్నారు. దాదాపుగా 20కిపైగా మెట్లు ఉండడంతో ఖాతాదారులు పైకి వెళ్ళాలన్నా.. కిందికి రావాలన్నా.. చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాగే కొన్ని సందర్భాలలో వృద్దులు వికలాంగులు కిందకుపడి గాయాలకు గురైన సందర్భాలు ఉన్నాయాన్నారు. అలాగే గురువారం గర్భిణి అయిన అంజలికి జరిగిన సంఘటన చాలా బాధాకరమన్నారు. అలాంటి సంఘటన జరుగకుండా బ్యాంక్‌ను కింది మార్చాలని డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని స్టేట్ బ్యాంక్ మేనేజర్ కార్తీక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమంతు, చిన్నకోసిగయ్య, శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు తాయన్న, జిలాని పాల్గొన్నారు.



సూర్య

శనివారం | 08 మార్చి 2025

# వైభవంగా గోదాగోకులం ద్వితీయ వార్షికోత్సవాలు



సింహవాహనంపై విహరిస్తున్న గోదా రంగనాథ స్వామి

## సింహ, అశ్వవాహనంపై విహరించిన శ్రీవారు

## చక్రస్నానంతో పూర్తయిన వార్షికోత్సవాలు

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్ :** కర్నూలు నగర శివార్లలో వెలసిన గోదాగోకులం ద్వితీయ వార్షికోత్సవాలు శుక్రవారం పూర్తయ్యాయి. ఐదు రోజులుగా వార్షికోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ గోదా రంగనాథ స్వామి వార్ల కళ్యాణోత్సవాన్ని కనులవిందుగా నిర్వహించారు. ఆలయ మాడ వీధుల్లో ఉదయం, రాత్రి గోదా రంగనాధులను వివిధ వాహనాలపై ఊరేగించారు. శుక్ర వారం సింహ, అశ్వ వాహనాలపై స్వామి వారు మాడ విధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. శుక్రవారం చక్రస్నానం కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. 108 నిర్మాణాలతో గోదా గోకులం అత్యంత వైభవంగా నిర్మించారు. మాడ వీధులు కూడా ఉండడం ఈ ఆలయం ప్రత్యేకం. నెల



రోజులుగా నిత్య కళ్యాణం నిర్వహిస్తోన్న ఆలయ నిర్వాహకులు ఏటా రెండు సార్లు బ్రహ్మోత్సవాలు కూడా నిర్వహిస్తున్నారు.

# కలెక్టరేట్‌లో 'షి' బాక్స్

- లైంగిక వేధింపులకు గురి చేస్తే చర్యలు
- భయపడకుండా ఫిర్యాదు చేయండి
- కర్నూలు కలెక్టర్ రంజిత్‌బాష

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురయ్యే మహిళలు ఫిర్యాదు చేసేందుకు వీలుగా కర్నూలు కలెక్టరేట్‌లో 'షి'బాక్స్ ఏర్పాటు చేశారు. లైంగిక వేధింపులకు గురయ్యే మహిళలు ధైర్యంగా తమ ఫిర్యాదులను ఈ బాక్స్‌లో వేయవచ్చు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాష ప్రారంభించారు. ఏపిజెఏసి అమరావతి, కర్నూలు జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న మహిళా ఉద్యోగులు బహిరంగంగా




షీబాక్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రంజిత్‌భాషా

చెప్పుకోలేకపోతే ఈ బాక్స్‌లో తమ సమస్యలు లిఖిలపూర్వకంగా వేయవచ్చని, వేధింపులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్‌ఓ వెంకటనారాయణమ్మ, ప్రభుత్వ ఆసుపత్రి ఏఓ సింధు సుబ్రహ్మణ్యం, ఏపిజెఏసి అమరావతి జిల్లా అధ్యక్షులు కెవై కృష్ణ, మహిళా విభాగం చైర్ పర్సన్ సహెరాబాను, శివపార్వతి, ఏపిఆర్‌ఎస్‌ఏ ఉపాధ్యక్షులు, ఏపిజెఏసి అమరావతి సహఅధ్యక్షులు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# పీఎం జన ఔషధ మందులను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్



రైతునగర్‌లో ఉన్న జనరిక్ మందుల దుకాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రధానమంత్రి జనరిక్ ఔషధ మందుల దుకాణాల ద్వారా తక్కువ ధరకే లభ్యమయ్యే నాణ్యమైన మందులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. కేంద్ర ప్రభుత్వ జన ఔషధ దివస్ సందర్భంగా శుక్రవారం నంద్యాల పట్టణంలోని రైతునగర్‌లోని జనరిక్ మందుల దుకాణాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి జన ఔషధ కేంద్రాల ద్వారా తక్కువ ధరకే బ్రాండెడ్ కంపెనీల మందులను అందుబాటులో ఉంచుతుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు అవసరమైన మంచి బ్రాండెడ్ కంపెనీల ద్వారా తయారు చేసిన మందులను జనరిక మందుల దుకాణాల్లో ఉంచడం జరుగుతుందన్నారు. సాధారణంగా బీపీ, షుగర్ ఉన్నవారికి ఇతర షాపుల్లో నాలుగైదు వేల రూపాయలు అయ్యే మందుల దుకాణంలో అతి తక్కువ ధరకే మందులు లభ్యమవుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైద్య విద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ కలెక్టర వెంట ఉన్నారు.

# జనరిక్ మందులపై అవగాహన కల్పించాలి : ఎంపి బస్తిపాటి



మాట్లాడుతున్న ఎంపి బస్తిపాటి నాగరాజు

**కర్నూలు క్రైం, మేజర్ న్యూస్ :** జనరిక్ మందులపై అందరికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు. శుక్రవారం నగరంలో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న జన ఔషది కేంద్రంలో నిర్వహించిన జన ఔషది దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జన ఔషది కేంద్రంలోని జనరిక్ మందులను పరిశీలించిన ఎంపి జనరిక్ మందులను కొనగోలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో తనకు మొదటిసారి మాట్లాడే అవకాశం ఆరోగ్యంపై వచ్చిందని అందులో భాగంగా జనరిక్ మందులపైనే మాట్లాడానన్నారు. జనరిక్ మందులపై ప్రజలు అపోహలు చెందాల్సిన అవసరం లేదని బ్రాండెడ్ మందుల లాగానే ఈ మందులు పని చేస్తాయన్నారు. బ్రాండెడ్ మందులతో పోల్చుకుంటే జనరిక్ మందులు అతి తక్కువ ధరలకే లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శశికళ,జిల్లా ఔషధాల శాఖ ఏడి రమాదేవి,డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు హరిహర తేజ, పర్వీన్ సుల్తాన్‌లు పాల్గొన్నారు.

# నెమ్మదిగా బయలుపడుతున్న సంగమేశ్వర ఆలయం

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** శ్రీశైల జలాశయంలో నీటి మట్టం ఈ ఏడాది నెమ్మది నెమ్మదిగా తగ్గుతుండటంతో నీటిలో మునిగిన సంగమేశ్వర ఆలయం కూడా ఈ ఏడాది ఆలస్యంగా బయలు పడుతుంది. కృష్ణా జలాల నుంచి ఆలయం పూర్తిగా బయలుపడాలంటే జలాశయంలో ఇంకా 9 అడుగుల మేర నీరు తగ్గాలి. ప్రస్తుతం జలాశయంలో 846 అడుగుల నీళ్ళు ఉన్నాయి. ఈ నీటి మట్టం 837 అడుగులకు చేరినట్లైతే సంగమేశ్వర ఆలయం పూర్తిగా బయలుపడి పూజలు జరగనున్నాయి. ప్రతి ఏడాది శివరాత్రికే ఆలయం బయలుపడి పూజలు అందుకునేంది. ఈ సారి ఉగాది తర్వాతనే ఆలయం బయలుపడి పూజలు జరిగే అవకాశం ఉందని ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం నీటిలో మునిగి ఉన్న ఆలయంను ఆయన సందర్శించారు. ఆలయంపైభాగాన శిఖర భాగంను పరిశీలించారు. జలాశయంలో 9 అడుగుల నీరు తగ్గినట్లైతే ఆలయం పూర్తిగా బయలుపడి వేపదారు శివలింగానికి పూజలు జరుగుతాయని తెలిపారు.



నీటిలో నుంచి బయటపడుతున్న ఆలయం

# రైతులకు గిట్టుబాటు ధర కల్పించండి



**ఓర్వకల్లు, మేజర్ న్యూస్ :** పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐటిసి కంపెనీ గోడౌన్‌ను సందర్శించి రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కంపెనీ వారితో మాట్లాడుతూ కొనుగోలు విషయంలో రైతులకు అన్యాయం జరుగకుండ గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని ఐటిసి కంపెనీ యాజమాన్యానికి తెలిపారు. గత ఏడాది రైతులకు గిట్టుబాటు ధర రావడంతో ఈ ఏడాది ఎక్కువ శాతం పొగాకు పంటను పండించడం జరిగిందని గ్రేడింగ్ విధానంలో రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి,జడ్‌పిటిసి రంగనాథ్‌గౌడ్, వైసిపి నాయకులు జికె వెంకన్న,మహేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి,చంద్రశేఖర్‌రెడ్డి,రైతులు పాల్గొన్నారు.

# పరిశ్రమల ఏర్పాటుకు మహిళలు ముందుకు రావాలి

**– జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా**

**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** సూక్ష్మ,చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు మహిళలు ముందుకు రావాలని, బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషా సూచించారు. శుక్రవారం మౌర్య ఇన్ హోటల్ పరిణయ హాల్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిన మెగా ఎంఎస్‌ఎంఈ ఔట్‌రీచ్ ప్రోగ్రాంలో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర,రాష్ట్ర పథకాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా మహిళలు బ్యాంకు రుణాలు పొంది అభివృద్ధి చెందాలని కోరారు. అలాగే మహిళల అభివృద్ధికి బ్యాంకులు చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. యూనియన్ బ్యాంకు మెగా ఔట్‌రీచ్ కార్యక్రమం ద్వారా యువత మహిళలను పారిశ్రామిక రంగంవైపు ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర




మెగా చెక్కును అందిస్తున్న దృశ్యం

ప్రభుత్వం ఆద్వర్యంలో మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దాదాపు రూ.130 కోట్లు లబ్ధికి సంబంధించిన మెగా చెక్కులను మహిళలకు అందచేయనున్నట్లు వివరించారు. అనంతరం ఎస్‌హెచ్‌జి గ్రూపులకు మంజూరైన రూ.35కోట్ల రుణాలకు సంబంధించి మెగా చెక్కును మహిళా సంఘం సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ నరసింహరావు, జీఎం సుధాకర్ రావు, పరిశ్రమల శాఖ జీఎం అరుణ, మెప్మా పిడి నాగశివలీల, ఏపిఐఐసి జడ్‌ఎం మధుసుదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన బడేసాహెబ్ స్వామి ఉరుసు



స్వామివారికి జియారత్ గంధం అందజేస్తున్న పీఠాధిపతులు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గంజహళ్లి గ్రామంలో వెలసిన మహాత్మ బడేసాహెబ్ స్వామి వారి ఉరుసు మహోత్సవం శుక్రవారం జియారత్ గంధం తో ఘనంగా ముగిసింది. ఉదయం నుంచి దర్గా పీఠాధిపత శ్రీలు స్వామి వారి గంధంతో మేళతాళలతో ఉరేగింపుగా దర్గాను చేరుకొని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. స్వామి వారి జీవసమాది కి భక్తితో గంధం పట్టించా రు. సమాదిని పూలతో అలంకరించి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమానికి భక్తుల పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పీఠాధిపతుల ఇంటి నుంచి గంధంను దర్గాకు తీసుకువెలు తున్న మార్గంలో భక్తులు పీఠాదిపతులను ప్రత్యేకంగా పూలు, జలం, అత్తరుతో పూజిం చారు. స్వామివారి ఉరుసు సందర్భంగా పలు ప్రాంతాల నుంచి దాదాపు 2 లక్షల మంది భక్తులు హాజరైనట్లు తెలిసింది.